ఈనాడు ఒడిశా

ఆదివారం అక్టోబరు 20, 2024

రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులొస్తాయి

పారిశ్రామిక దిగ్గజాలతో మోహన్ చర్చలు


నాసిం గోద్రెజ్‌తో కరచాలనం చేస్తున్న మనోజ్, చిత్రంలో సీఎం మోహన్, మంత్రి సంపద్ తదితరులు


సజ్జన్ జిందాల్‌తో మోహన్ కరచాలనం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులొస్తాయని, ప్రముఖ కంపెనీలు ఒడిశాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చాయని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. ముంబయిలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఉత్కర్ష ఒడిశా-2024' పెట్టుబడిదారుల సదస్సులో శనివారం రెండోరోజు పారిశ్రామిక దిగ్గజాలతో ముఖ్యమంత్రి ముఖాముఖి చర్చించారు. అనంత అంబానీ, కుమార మంగళం బిర్లా, సజ్జన్ జిందాల్, అనిల్ అగ్రవాల్, నాసిం గోద్రెజ్, విజయ్ గోయెంకా, బాలకృష్ణ గోయెంకా తదితరులతోపాటు ప్రముఖ పారిశ్రామిక గ్రూపుల నేతలతో మాట్లాడారు. రైల్వే, రహదారులు, ఓడరేవులు, ఖనిజ సంపద ఉన్న రాష్ట్రంలో రసాయనాలు, పెట్రో కెమికల్స్, ఉక్కు, అల్యూమినియం, విద్యుత్తు, ఆహారోత్పత్తులు, టెక్స్‌టైల్స్, టూరిజం రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు పుష్కలమన్నారు. స్థిరమైన ప్రభుత్వం అధికారంలో ఉందని, శాంతిభద్రతలకు ఢోకా లేదన్నారు. 300 మంది ప్రతినిధులతో చర్చించిన సీఎం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో వృద్ధి రేటు (జీడీపీ) 8 శాతంగా ఉందని, ఇది దేశ జీడీపీ కంటే ఎక్కువన్నారు. ఒడిశా తూర్పు తీరం ఆర్థిక కారిడార్ కానుందన్నారు. ప్రముఖ కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి కనబరిచాయన్నారు. 2025 జనవరి 28, 29 తేదీల్లో భువనేశ్వర్‌లో ఏర్పాటయ్యే 'ఉత్కర్ష ఒడిశా' పెట్టుబడిదారుల సదస్సులో దేశ, విదేశాలకు చెందిన కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ముంబయి సదస్సు విజయవంతమైందని చెప్పారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ స్వాయిన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి హేమంత్‌శర్మ పాల్గొన్నారు.


అనంత అంబానీతో మోహన్ చర్చలు


అనీల్ అగ్రవాల్‌తో సీఎం


జార్పడ కారాగారంలో విచారణ ఖైదీ మృతి

హత్య చేశారంటూ బాధిత కుటుంబీకుల ఆరోపణ


జార్పడ ప్రత్యేక కారాగారం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాజధాని భువనేశ్వర్‌లోని జార్పడ ప్రత్యేక కారాగారంలో విచారణలో ఉన్న ఖైదీ మృతి చెందడం పలు అనుమానాలకు దారితీస్తోంది. ఇది ముమ్మాటికీ హత్యేనంటూ బాధిత కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి లక్ష్మీసాగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నయాగఢ్ జిల్లా దస్‌పల్లాకు చెందిన బిద్యాధర్ గురు(48) భువనేశ్వర్‌లోని ఆటో పోద కడిగా పనిచేస్తూ మైత్రి విహార్ పోలీసుస్టేషన్ పరిధి బెహరా వీధిలో తన కుటుంబంతో నివసిస్తున్నాడు. అక్టోబరు 5న ఆయనపై మాదక ద్రవ్యాలకు సంబంధించి కేసు నమోదు కావడంతో జార్పడ కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్నాడు. శుక్రవారం ఆయనకు ఛాతీలో నొప్పి రావడంతో కారాగారం సిబ్బంది క్యాపిటల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై భార్య జును గురు మాట్లాడుతూ కారాగార సిబ్బంది చిత్రహింసల కారణంగా తన భర్త చనిపోయాడని ఆరోపించారు. ఆయన తల వెనుక, ఎడమ కన్ను పైభాగంలో తీవ్ర గాయాలు ఇందుకు నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు.

శవ పరీక్ష వాయిదా


బిద్యాధర గురు

ఈ విషయమై జైళ్ల శాఖ డీజీ అరుణ్‌కుమార్‌రాయ్ మాట్లాడుతూ బాధిత కుటుంబీకుల ఆరోపణల నేపథ్యంలో గురు మృతదేహానికి నిర్వహించే శవపరీక్షను ఆదివారానికి వాయిదా వేశామన్నారు. అనుమానాలు తొలగించేందుకు ఈ ప్రక్రియను చిత్రీకరించనున్నట్లు రాయ్ వెల్లడించారు. అవసరమైతే జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్సీ) మార్గదర్శకాల అనుగుణంగా కేసు విచారణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గురు మృతికి సంబంధించి లక్ష్మీసాగర్ పోలీసుస్టేషన్లో అసహజ మరణం(యూడీ) కేసు నమోదైనట్లు అరుణ్‌కుమార్ గుర్తుచేశారు. గురు మద్యానికి, మత్తు పదార్థాలకు బానిసైనట్లు తెలిసిందని డీజీ పేర్కొన్నారు. మరోవైపు కారాగారంలో ఖైదీలకు అవసరమగు పొగాకు ఉత్పత్తులు, చరవాణిలు, ఇతరత్రా సౌకర్యాలు సమకూరుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం రూ.200 నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు గతంలో సౌమ్యకాంత్ మహంతి అనే ఓ విచారణ ఖైదీ జిల్లా న్యాయసేవల అథారిటీ(డీఎల్ఎస్ఏ)కి లేఖ రాసిన విషయాన్ని ఈ సందర్భంగా పలువురు ప్రస్తావిస్తున్నారు.

ఇకపై 'వికసిత గ్రామాలు...వికసిత ఒడిశా'


రబినారాయణ నాయక్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: 'అమో ఒడిశా...నవీన్ ఒడిశా' అన్న పదం ఇక వినిపించదు. దీని పేరు మారింది. 'వికసిత గ్రామాలు...వికసిత ఒడిశా' అన్న పేరును ప్రభుత్వం ఖరారు చేసింది. రెండు రోజుల్లో కొత్త నిబంధన అమలు చేస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి రబినారాయణ నాయక్ చెప్పారు. శనివారం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నవీన్ ఒడిశా పేరిట గతంలో ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, ఎన్నికైన ప్రతినిధుల స్థానంలో అధికారులు పెత్తనం చెలాయించారని ఆరోపించారు. కొవిడ్ సమయంలో సర్పంచులకు పాలనాధికారుల హోదా కల్పించామన్న గత ప్రభుత్వం నానా చాకిరి చేయించుకుని తరువాత వారిని పట్టించుకోలేదన్నారు. పంచాయతీలను పరిపుష్టం చేస్తామని, గ్రామసభల నిర్ణయాల మేరకు పనులు జరుగుతాయన్నారు. నిర్మాణ వ్యయం కూడా గ్రామసభల్లో ప్రజలు తెలుస్తారన్నారు. వికసిత గ్రామం, వికసిత ఒడిశా కార్యక్రమాలు గ్రామీణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు ప్రతిబింబాలు అవుతాయన్నారు. పంచాయతీరాజ్‌లో ఇకపై అధికారుల పెత్తనం చెల్లుబాటు కాదన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో త్వరలో 'పెసా' చట్టం అమలుచేసి గిరిజనానికి పూర్తి స్వేచ్ఛ, హక్కులు కల్పిస్తామన్నారు. బిజద ఉనికి కోల్పోయే స్థితిలో ఉందని, ఆ పార్టీ నేతలంతా కొద్దిరోజుల్లో భాజపాలో చేరతారని రబినారాయణ నాయక్ చెప్పారు. బిజద భాజపాలో విలీనం అవుతుందన్నారు.

బాణసంచా విస్ఫోటనం: నలుగురికి తీవ్ర గాయాలు




కళ్లికోట ఆరోగ్య కేంద్రంలో బాధిత బాలలకు చికిత్సలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలోని మాణికపూర్ గ్రామం శివారులోని ఓ రేకుల ఇంట్లో శనివారం మధ్యాహ్నం బాణసంచా సామగ్రి తయారు చేస్తుండగా విస్ఫోటనం జరిగింది. ఈ ప్రమాదంలో దీపావళికి బాణసంచా సామగ్రి తయారు చేస్తున్న నలుగురు బాలురు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థులు వారిని కళ్లికోట ఆరోగ్య కేంద్రంలో చికిత్సకు చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని ఎమ్కేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు మాణికపూర్ గ్రామానికి చెందిన ప్రసాద గౌడ, బాదల్ గౌడ, బబులా గౌడ, సమీర్ దహుడిలు. వీరంతా విద్యార్థులని తెలిసింది. వీరిలో బాదల్ కాలు, చేయి తీవ్రంగా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న కళ్లికోట ఠాణా పోలీసులు గ్రామానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. పేలుడు ధాటికి ఇంటి పైకప్పు రేకు ఎగిరిపోగా, గదిలో సామగ్రి చెల్లాచెదురైంది.


పేలుడు ధాటికి ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకు


విస్ఫోటనానికి గదిలో చెల్లాచెదురుగా పడ్డ సామగ్రి

తాల్చేరు నుంచి పరదీప్‌కు రహదారి

నిర్మాణ వ్యయం రూ.12 వేల కోట్లు



మాట్లాడుతున్న ఉషా పాఢి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: నల్ల బంగారానికి (బొగ్గు) నిలయమైన అనుగుల్ జిల్లా తాల్చేరు నుంచి ధమ్రా, పరదీప్ ఓడరేవులను కలిపే 5వ నెంబరు రహదారి నిర్మాణం జరుగుతుందని వాణిజ్య, రవాణా శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శి ఉషాపాఢి చెప్పారు. శుక్రవారం రాత్రి భువనేశ్వర్‌లో ఉత్కళ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి సమగ్ర పథక నివేదిక (డీపీఆర్) సిద్ధమైందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఇన్‌ల్యాండ్ అథారిటీ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఈ నిర్మాణం చేయనుందని, నిర్మాణ వ్యయం రూ.12 వేల కోట్ల అంచనాగా పెట్టుకున్నట్లు వివరించారు. నేషనల్ హైవేతో వాటర్‌వేను అనుసంధానించడం ద్వారా సరకు రవాణా మరింత తేలికవుతుందని చెప్పారు. ఆమోదం పొందిన ఈ ప్రాజెక్టు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు.

ఓఏఎస్ ఫలితాలు వెల్లడి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఓపీఎస్సీ) ఆధ్వర్యంలో 2022లో జరిగిన రాష్ట్ర పాలనా విభాగం (ఓఏఎస్) పరీక్షలు ఫలితాలు శనివారం రాత్రి ప్రకటించారు. 683 మంది ఉత్తీర్ణులు కాగా, వీరిలో 258 మంది మహిళలున్నారు. టాప్‌టెన్ స్థానాల్లో అయిదుగురు మహిళలు, అయిదుగురు పురుషులున్నారు.

టాప్‌టెన్‌లో నిలిచినవారు...

1. శ్వేతశ్రీ మహాపాత్ర్, 2. పింకిల్ పర్వీన్ పరిడ, 3. దీప్తిరంజన్ పతి, 4. ప్రజ్ఞా పరంగం, 5. అజాద్‌కుమార్ సాహు, 6. దీపం రౌత్, 7. దేవవ్రత గౌడ, 8. ఆదిత్య పంకజ్ షడంగి, 9. కపిల్‌కుమార్ మహంతి, 10. అమృతాసాహు.

ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేయాలి

గవర్నర్ రఘుబర్‌దాస్


మాట్లాడుతున్న రఘుబర్ దాస్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యక్రమాలు సక్రమంగా అమలు చేసే బాధ్యత ఐఏఎస్, ఓఏఎస్ అధికారులపై ఉందని, వారంతా ప్రజా సేవకులన్న వాస్తవం గుర్తుంచుకోవాలని గవర్నర్ రఘుబర్‌దాస్ చెప్పారు. శుక్రవారం రాత్రి భువనేశ్వర్‌లో రాజ్‌భవన్‌లో ఓఏఎస్ శిక్షణ (ట్రైయినీలు) పొందుతున్నవారికి గవర్నరు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమాలు విజయవంతం చేయడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రజాధనం ప్రతిరూపాయి సద్వినియోగం చేసే బాధ్యత పాలనాధికారులపై ఉందన్నారు. గోపబంధు అకాడమీలో శిక్షణ పొందుతున్న ఓఏఎస్‌లు సమయం విలువ, రేపటి బాధ్యతలు తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రఘుబర్ ట్రైయినీలకు అల్పాహార విందు ఇచ్చారు.


పాల్గొన్న ట్రైనీ ఓఏఎస్‌లు

370 పాఠశాలలకు విద్యార్థులు దూరం


ఓ పాఠశాల వద్ద ఉపాధ్యాయురాలికి వినతిపత్రాలను అందజేస్తున్న తల్లిదండ్రులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లాలో దాదాపు 370 ప్రభుత్వ పాఠశాలలకు తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించకపోవడం శోచనీయం. జిల్లాస్థాయిలో ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించాలంటూ ఇటీవల జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ద్వారా నిరసనలు చేసిన విషయం తెలిసిందే. దసరా సెలవులు తర్వాత కమిటీ పిలుపు మేరకు పిల్లలను బడికి పంపలేదు. జిల్లాలో మొత్తం 1848 పాఠశాలలు ఉండగా అందులో 370 బడులు శనివారం ఖాళీగా కనిపించాయి. ఈ మేరకు వివిధ గ్రామాల్లో జిల్లాస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రిని ఉద్దేశించి తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయులకు వినతిపత్రాలను అందజేశారు. జిల్లాలో 10 సమితుల్లో అత్యధికంగా కొసగుముడా సమితిలో 195, డాబుగావ్‌లో 80, నవరంగపూర్‌లో 17, టెంటులిఖుంటి 6, పపదహండిలో 23, రాయ్‌ఘర్ 6, ఉమ్మర్‌కోట్ 6, జోరిగావ్ 35, చందాహండి, నందహండి ఒక్కొక్క పాఠశాలకు పిల్లలు వెళ్లలేదని సమాచారం. పొరుగు రాష్ట్రాల నుంచి నూతన ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించడంతో ఈ పాఠశాలల బహిష్కరణ జరిగినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. రానున్న రోజుల్లో అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో 14 మంది శాసనసభ్యులు, ఇద్దరు ఎంపీల ఇంటి వద్ద ఆందోళన చేపడతామన్నారు. మరోవైపు విద్యాశాఖ మంత్రి నిత్యానంద్‌గండ్ నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరించడం అందరినీ ఆశ్చర్యం కలిగిస్తోంది. అవిభక్త కొరాపుట్ జిల్లాకు ప్రత్యేక హోదా ఇవ్వాలని కమిటీ డిమాండ్ చేసింది.

బిజద ఓటమికి నాలుగు కారణాలు

పద్మనాభ బెహరా



భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజద ఓటమికి నాలుగు కారణాలున్నాయని పార్టీ అగ్రనేత **పద్మనాభ బెహరా** చెప్పారు. శనివారం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీనియర్ నేతల సూచనలు పరిగణనలోకి తీసుకోకుండా టికెట్ల కేటాయింపు ఒక కారణమన్నారు. నవీన్ ప్రచారానికి వెళ్లకపోవడం పార్టీని దెబ్బతీసిందన్నారు. బిజద మేనిఫెస్టో ప్రజల్ని ఆకర్షించలేకపోయిందని, అదే సమయంలో భాజపా మేనిఫెస్టో బాగుందని ఓటర్లు ఆకర్షితులయ్యారని చెప్పారు. నవీన్ విధేయులుగా చెప్పుకునేవారు అధినేతను తప్పుదోవ పట్టించడంతో పరాజయం మూటకట్టుకోవాల్సి వచ్చిందన్నారు. వెన్నుపోట్లు కూడా మరో ప్రధాన కారణమని విశ్లేషించారు. ఈ నేపథ్యంలో కొంతమంది నేతలు పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, అవి వారి వ్యక్తిగత అభిప్రాయాలు కావచ్చన్నారు. ప్రజలు మార్పు కోరుకున్నారని, పర్యవసానం భాజపా అధికారంలోకి వచ్చిందన్నారు.

పిల్లల్ని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలి

జగన్నాథతత్వం వివరించాలన్న ప్రభాతి


ప్రసంగిస్తున్న ప్రభాతి


పాల్గొన్న హబిషార్థులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పిల్లలకు తల్లులు తొలి గురువులని, వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని, సత్ప్రవర్తన, సద్భావన, సద్గుణాలు ప్రోది చేయాలని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడ కోరారు. శనివారం పూరీలోని బృందావతి నివాస్‌లో హబిషార్థులతో (కార్తిక వ్రత దీక్షాధారులు) ఆమె మాట్లాడారు. విశ్వ సోదర భావానికి ప్రతీక పూరీ శ్రీక్షేత్రమని, జగన్నాథునితత్వంలో మానవాళి నేర్చుకునేది చాలాఉందన్నారు. కార్తిక వ్రతాలు చేసేవారు స్వామి లీలల పరమార్థం గురించి కుటుంబ సభ్యులకు వివరించాలన్నారు. పూజలు, వ్రతాల పరమార్థం గురించి ఇతరులకు తెలియజేయాలన్నారు. కార్తిక వ్రత దీక్షాధారులకు ప్రభుత్వం పూరీలో ఉచిత సౌకర్యాలు కల్పిస్తున్న నేపథ్యంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, వ్యర్థాలు ఎక్కడికక్కడ పడేయొద్దని, యంత్రాంగానికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీక్షేత్ర పాలనాధికారి అరవింద పాఢి, పూరీ పాలనాధికారి సిద్ధార్థ్ శంకర్ స్వాయిన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హబిషార్థులు జగన్నాథుని కీర్తనలు ఆలపించారు.

పంటను దళారుల పాలు చేయొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ పరుల్. పక్కన సరస్వతి

రాయగడ, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి పండించిన పత్తిని దళారులకు విక్రయించవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన మండీల్లోనే అమ్మకాలు చేయాలని పాలనాధికారి పరుల్ పట్వారి రైతన్నలకు సూచించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో పత్తి సేకరణపై సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. సమీకృత వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలో తూనిక యంత్రాలు సరిగ్గా పనిచేసేలా చూడాలని, నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్నదాతలు ఇబ్బందులు పడకుండా చూడలన్నారు. ప్రతి వారం రాయగడ, గుణుపురం సబ్ కలెక్టర్లు సమీక్ష నిర్వహించాలని చెప్పారు. జిల్లా ముఖ్య వ్యవసాయశాఖ అధికారి బిష్ణుప్రసాద్ ఖర్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 49,810 హెక్టార్లలో పత్తి సాగు చేశారని, సుమారు 7, 23, 252 క్వింటాళ్ల పత్తి పండే అవకాశం ఉందని తెలిపారు. క్వింటా పత్తికి రూ.7521 ధర నిర్ణయించినట్లు తెలిపారు. రాయగడ శాసనసభ్యుడు అప్పలస్వామి కడ్రక, బిసంకటక్ శాసనసభ్యుడు నీలామాధవ హికాక, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, రైతులు, అధికారులు హాజరయ్యారు.

పొంచి ఉన్న తుపాను?

గోపాల్‌పూర్ తీరంలో శనివారం గంగపుత్రులు



మత్స్యకారుల్లో ఆందోళన

23 నుంచి 25 వరకు భారీ వర్షాలకు అవకాశం

పాలనాధికారులను అప్రమత్తం చేసిన సింగ్

గోపాలపూర్, న్యూస్‌టుడే

ఉత్తర అండమాన్ సముద్రంలో ఆదివారం ద్రోణి ఏర్పడనుంది. మంగళవారం(22న) నాటికిది అల్పపీడనంగా మారుతుంది. క్రమేణా బలం పుంజుకుని వాయుగుండంగా మారి కేంద్ర బంగాళాఖాతం మీదుగా ఒడిశా తీరానికి చేరువవుతుందని వాతావరణ అధ్యయనశాఖ (ఐఎండీ) అధికారవర్గాలు శనివారం స్పష్టం చేశాయి. 23 నుంచి 25 వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయన్న అంచనా ఉంది. వాయుగుండం తుపానుగా మారుతుందా? అన్నదానిపై ఐఎండీ వర్గాలు స్పష్టం చేయలేదు.

22 తర్వాతే చెప్పగలం

గోపాల్‌పూర్ ఐఎండీ కేంద్రం అధికారి ఉమాశంకర్ దాస్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన తర్వాతే దాని దిశ, తీవ్రత గురించి చెప్పగలుగుతామన్నారు. ప్రస్తుత అధ్యయనం ప్రకారం... పీడనం వాయుగుండంగా మారుతుంది. ఇది ఒడిశా తీరానికి చేరువవుతుందన్నారు. తర్వాత ఇది బలం పుంజుకుని తుపానుగా మారుతుందా? అన్నది 22 తర్వాతే తెలియజేస్తామన్నారు.

ఈ జిల్లాల్లో వర్షాలు

24 రాత్రిలోగా విపత్తుతీరం దాటుతుందన్న అంచనా ఉంది. ఈ నేపథ్యంలో 23 నుంచి 25 వరకు ఉత్తరకోస్తా, తీర జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి. గంజాం, గజపతి, పూరీ, ఖుర్దా, కటక్, జాజ్‌పూర్, నయాగఢ్, జగత్సింగ్‌పూర్, కేంద్రపడ, బాలేశ్వర్, భద్రక్, కేంఝర్, మయూర్‌భంజ్ జిల్లాలకు ముందస్తుగా ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు ఐఎండీ అధికారి ఉమాశంకర్ చెప్పారు.

ఓడ్రాఫ్ సిబ్బందిని తరలించాలి

ఈ నేపథ్యంలో ప్రత్యేక రిలీఫ్ కమిషనర్ దేవారంజన్ సింగ్ శనివారం 14 జిల్లాల పాలనాధికారులతో వర్చువల్ మాధ్యమంలో మాట్లాడారు. ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ, జలవనరులు, వ్యవసాయ శాఖ సిబ్బంది సెలవులు అవసరమైతే రద్దు చేయాలన్నారు. ఓడ్రాఫ్, అగ్నిమాపక జవానులను సంబంధిత జిల్లాలకు 23 ఉదయానికి తరలించనున్నారు.

అక్టోబరు భయం

అక్టోబరులో అండమాన్‌లో పురుడు పోసుకునే అల్పపీడనాలు తుపానులుగా మారి ఒడిశాలో తీరం దాటిన దాఖలాలున్నాయి. అందుకే అందరిలో ఇప్పుడు భయం కనిపిస్తోంది. ముఖ్యంగా తీర జిల్లాల గంగపుత్రులు ఆందోళన చెందుతున్నారు.

ట్రాఫిక్ ఇక్కట్లు తీరేనా..

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్‌లో ట్రాఫిక్‌తో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంతో పోలిస్తే జనాభా పెరిగినా రహదారుల విస్తరణ జరగలేదు. దీంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. 1953లో ఎన్ఏసీగా, 1970లో పురపాలికగా, 1992లో జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం పట్టణంలో 2,80,000 మంది జనాభా కలిగి ఉందని, పట్టణం మధ్యలో దాదాపు 5 కిలోమీటర్ల వరకు జాతీయ రహదారి-26 ఉండడంతో ట్రాఫిక్ కష్టాలు మరింత ఎక్కువయ్యాయి. భారీ వాహనాల రాకపోకలతో చిన్నపాటి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులను విస్తరించాలిని స్థానికులు కోరుతున్నారు. జిల్లా ఏర్పడి ఏళ్లు గడిచినా నేటికీ గ్రామ రహదారులుగా కనిపిస్తున్నాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' శాసనసభ్యుడు గౌరీ శంకర్ మాఝి వద్ద ప్రస్తావించగా దీనిపై కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని త్వరలో వివరాలు వెల్లడిస్తామన్నారు.


హిల్లికి వెళ్లే మార్గంలో రహదారిపై నిలిచిన వాహనాలు

పరబ్ వేడుకలకు మైదానం సిద్ధం




కొత్త మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

కొరాపుట్, న్యూస్‌టుడే: ఆదివాసీ కళలు, సంస్కృతి పరిరక్షణే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం, సాంస్కృతిక శాఖ సంయుక్తంగా నిర్వహించే పరబ్ ముఖ్య వేడుకలకు కొత్త మైదానం సిద్ధమవుతోంది. గతంలో లండిగుడలో డీవీపీ కళాశాల మైదానంలో ఈ కార్యక్రమం జరిగేది. జాతీయ రహదారి పక్కనే ఉండటంతో ట్రాఫిక్ అంతరాయం కలిగి యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. ఈ ఇబ్బందులు దృష్టిలో ప్రస్తుతం రంగబలి కుంభ వద్ద ఒక మైదానాన్ని ఎంపిక చేశారు. డిసెంబరు 14 నుంచి 18వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మిత మెలక, సబ్‌కలెక్టర్ వేజిధర్ సునీర్, జిల్లా పరిషత్ సీడీఓ దేవాసిస్ పట్నాయక్ తదితరులు శనివారం మైదానానికి చేరుకుని పనులు పరిశీలించారు.

కాలాజీర వరి సాగుకు పెరుగుతున్న ఆదరణ

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో గిరి రైతులు తాజాగా 'జీఐ' గుర్తింపు పొందిన కాలాజీర రకం వరి సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ధాన్యం మార్కెట్లో మంచి లాభాలు తెచ్చిపెడుతుంది. జిల్లాలో 1200 మంది గిరి రైతులు జీవిధ్యాంగ సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. సుమారుగా 1500 ఎకరాల్లో కాలాజీర ధాన్యం సేంద్రియ పద్ధతి ద్వారా సేద్యం జరుగుతుండగా వ్యవసాయ నిపుణులు అధికారి ప్రభాకర్ చెప్పారు. ఈ పంటను పండించడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. దీనిలో పోషకాలు, ఔషధగుణాలు ఉండడంతో ప్రజాదరణ పొందుతోందని అన్నారు.



ఆశలు రేపుతున్న కాలాజీర ధాన్యం

కాళీ పూజలకు ఏర్పాట్లు

జయపూర్, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రుల అనంతరం అట్టహాసంగా కాళీ పూజలు నిర్వహిస్తారు. దీపావళి అమావాస్య రాత్రి నుంచి ప్రారంభమవుతాయి. పట్టణంలో గేటేబజార్ షట్టి మార్కెట్, మలంగా నవరాజ్ చౌక్ కాళీ మందిరం, బజారుల్లి కాళీ మందిరం, ఖరీదా, ఇందా ప్రాంతాలతో పాటు ప్రముఖ ఆలయాలు, చిన్న పెద్ద మందిరాలను దీపావళి నాటికి అందంగా ముస్తాబు చేసి శాస్త్రోక్తంగా పూజలు చేస్తారు. మండపాల్లోనూ ఈ క్రతువులు జరుగుతాయి. ఖరీదా వ్యాపారుల సంఘం 22 అడుగుల ఎత్తు కాళికామా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జయపూర్‌లో 27 యూత్ సెంటర్, మలంగా స్టార్ యూనిట్ క్లబ్ ఆధ్వర్యంలో భారీ మండపాలు సన్నద్ధమవుతున్నాయి. ధ్వజస్తంభ స్థాపనతో వీటిని ప్రారంభిస్తారు.

రాయగడ, న్యూస్‌టుడే: పట్టణంలో కాళీపూజ మండపం వద్ద 42వ వార్షిక కాళీపూజల కోసం శనివారం ముహూర్తపు రాట కార్యక్రమం జరిగింది. నిర్వాహకుడు శివపట్నాయక్, శివాజీదాస్, సంగ్రామ్ పట్నాయక్, సభ్యులు పాల్గొన్నారు. ఈ ఏడాది 10 రోజులపాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు, ప్రతిరోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శివపట్నాయక్ తెలిపారు.



యూత్ సెంటర్ ఆధ్వర్యంలో ధ్వజస్తంభ స్థాపన



పూజా కార్యక్రమంలో పాల్గొన్న శివపట్నాయక్, శివాజీదాస్ తదితరులు

కళింగ క్రీడా మైదానంలో కశ్మీర్ యువత

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, క్రీడావిభాగం తరపున యూత్ టాలెంట్ ఎక్స్చేంజ్ కార్యక్రమంలో జమ్మూ కశ్మీర్ యువతీయువకులు శుక్రవారం రాష్ట్రానికి వచ్చారు. వివరాలను రాష్ట్ర క్రీడావిభాగం 'ఎక్స్'లో ఈ వివరాలు వెల్లడించింది. 132మందితో కూడిన యువ ప్రతినిధుల బృందం భువనేశ్వర్‌లోని కళింగమైదానంలో ఉన్న వివిధ క్రీడాంశాల సాధన సంపత్తి, ఇతర సౌకర్యాలు, క్రీడాభివృద్ధి పనులను సందర్శించి, క్రీడ శిక్షకులతో మాట్లాడి రాష్ట్రంలో క్రీడాభివృద్ధిపై అడిగితెలుసుకున్నారు.



కళింగమైదానంలో కశ్మీర్ యువతీయువకులు. చిత్రంలో క్రీడావిభాగం అధికారులు

డొంగిరియా యువకునికి సీఎం ప్రశంస

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లాలో ఆదిమ గిరిజన తెగ(పీవీటీజీ)కు చెందిన డొంగిరియా కొందొ యువకుడిని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ప్రశంసించారు. యూజీసీ-నెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి సహాయక ప్రొఫెసర్‌కు అర్హత సాధించిన ఆ యువకుడిని 'ఎక్స్' వేదికగా సీఎం అభినందించారు. వివరాల్లోకి వెళ్తే జిల్లాలోని బిసంకటక్, మునిగుడ, కె.సింగ్‌పూర్ సమితుల సరిహద్దులో నియమగిరి ప్రాంతానికి చెందిన అజయ్‌కుమార్ కద్రక యూజీసీ-నెట్-2024 పరీక్షల్లో సత్తా చాటారు. దీనిపై సీఎం చరణ్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ ఈ విజయం వెనుక ఆయన పట్టుదల, సంకల్పం మనకెంతో ఆదర్శమని కొనియాడారు.



అజయ్‌కుమార్ కద్రక

వృద్ధ మహిళ హత్య ఘటనలో నిందితుడి అరెస్టు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: వృద్ధ మహిళ హత్యనేరంపై పాడువ పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నందపూర్ ఎస్డీపీఓ సంబిత్ కుమార్ మజ్జి శుక్రవారం విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. కందగుడ గ్రామానికి చెందిన మలేతీలో(64) అనే వృద్ధురాలు 11వ తేదీన బల్లి గ్రామం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఆమె వద్ద ఉన్న డబ్బు, బంగారం కొట్టేయాలని కంకారుకు చెందిన శ్రీరామ్ దుర ఆమె వెనుకనే వెంటపడ్డాడు. వెనుక నుంచి ఆకస్మాత్తుగా మలేపై రాయితో దాడి చేసి హత్య చేశాడు. బాధితురాలి వద్ద రూ.1300 నగదు, శరీరంపై బంగారం దోచుకున్నాడు. మృతదేహాన్ని సమీప కాలువలో పారేసి పరారయ్యాడు. 12వ తేదీన కొంతమంది మహిళలు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో నిందితుడు శ్రీరామ్ అని తేలింది. రాణా అధికారి అశోక్‌కుమార్ బిసోయి నేతృత్వంలో ఎస్‌ఐ దీపక్ బారిక్ తదితరులు గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం శ్రీరామ్ బల్లా గుహల్లో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతను అటవీ ప్రాంతంలో దాచి పెట్టిన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాయగడలో జరిగింది. ఐఐసీ కమలకాంత్ తెలిపిన వివరాల ప్రకారం కుంబికోట పంచాయతీ తొయంగిరి గ్రామానికి చెందిన శ్రీపతిసేనాపతి రాయగడ-కొరాపుట్ 326వ నంబరు జాతీయ రహదారి మీదుగా బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. తీవ్రగాయాలైన శ్రీపతి(34) అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఐఐసీ తెలిపారు. మృతదేహాన్ని రాయగడ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

శ్రీక్షేత్ర సూపర్‌వైజర్‌పై కత్తితో దాడి

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో జగన్నాథునికి అర్చన కాని ఒబడా, చెన్నపుడి, భోజ్య తదితర పిండివంటలను సేవాయతులు స్వామి ప్రసాదాలుగా ఇదివరకు విక్రయించేవారు. ఈ విషయం యంత్రాంగం దృష్టికొచ్చిన తర్వాత ఆనందబజార్, పశ్చిమద్వారాల వద్ద సూపర్‌వైజర్లను నియమించారు. సూపర్, మహాసువారాల ప్రసాదాల విక్రయించేవారు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం చీకటి పడిన తర్వాత పశ్చిమ ద్వారం వెలుపల కాపలాగా ఉన్న సూపర్‌వైజర్ బిక్రింశాంత్ పడియారిపై ఒక వ్యక్తి కత్తితో దాడి చేసి పరారయ్యాడు. పడియారి చేతికి గాయాలవడంతో సేవాయతులు వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలిసిన పాలనాధికారి అదేవిధంగా నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని సింహద్వార రాణా అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

121 లీటర్ల విదేశీ మద్యం స్వాధీనం: ఒకరి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా భంజనగర్ రాణా పరిధిలోని ముజాగడ వద్ద పోలీసులు ఒకర్ని అరెస్టు చేశారు. ఆయన నుంచి 121.16 లీటర్ల వివిధ బ్రాండ్ల విదేశీ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు గంజాం ఎస్పీ కార్యాలయం అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సెక్స్ రాకెట్ గుట్టురట్టు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్ కమిషనరేట్ పోలీసు యంత్రాంగం శనివారం సెక్స్ రాకెట్ గుట్టు రట్టు చేసింది. డీసీపీ పినాకిమిశ్ర విలేకర్లకు తెలిపిన వివరాల మేరకు భువనేశ్వర్ రవిటాకీస్ కూడలిలో డైమండ్‌స్పా (బ్యూటీపార్లర్)లో అనైతిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసి దాడులు చేశారు. ఇద్దరు యువతులు, కొందరు యువకుల్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

సమస్యలపై చర్చ



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా బియ్యం మిల్లు యజమానుల సంఘం సర్వ సభ్య సమావేశం శనివారం జరిగింది. మధ్యాహ్నం స్థానిక హిల్‌పట్నాలోని సంస్కృతీ భవనంలో నిర్వహించిన దీనికి సంఘం అధ్యక్షుడు పూర్ణచంద్ర సాహు అధ్యక్షత వహించారు. ఇంకా ఇందులో ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర పాత్ర్, కార్యదర్శి తరుణ్ కాంత్ పాత్ర్, ప్రతినిధులు రాజేంద్ర కుమార్ పాఢి (చికిటి), ఎస్.బద్రినారాయణ పాత్ర్ (సురడా), సురేంద్ర కుమార్ పాఢి (పురుషోత్తంపూర్), గౌరంగ సాహు (దిగపాహండి) తదితరులు పాల్గొని మాట్లాడారు.

జాతీయ సదస్సులో పాల్గొన్న దంపతులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: రాజస్థాన్‌లో బికనర్‌కు చెందిన మహారాజ గంగాసింగ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు జరిగిన 61వ ఆల్ ఇండియా పొలిటికల్ సైన్స్ కాన్ఫరెన్స్‌లో కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణానికి చెందిన చిత్తరంజన్ మిశ్రా, ఆయన సతీమణి హాజరవ్వడం విశేషం. వికసిత్ భారత్ 2047పై జరిగిన సదస్సులో విశ్రాంతి అధ్యాపకులు చిత్తరంజన్ మిశ్రా, ఆయన సతీమణి సంఘ సేవకురాలు స్నిగ్ధరాణి మిశ్రాలు పాల్గొని మాట్లాడారు. వీరిద్దరిని నిర్వాహకులు వేదికపై సత్కరించారు.



సదస్సుకు హాజరైన దంపతులు

తండ్రి, కొడుకుపై ఆమ్ల దాడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కొంధమాల్ జిల్లా తుమిడిబొంధొ ఠాణా పరిధిలోని ముండిగడ పంచాయతీలో బుడాకుండెయి గ్రామంలోని తండ్రి మోదన్ పందర్ (40), కొడుకు అనుజ్ పందర్ (12)లపై శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో ఆమ్ల (యాసిడ్) దాడి జరిగింది. ముఖం, ఛాతిపై కాలిన ఇద్దరినీ గ్రామస్థులు తుమిడిబొంధొలోని ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఇద్దరినీ బలిగుడలోని సబ్ డివిజనల్ ఆసుపత్రికి తరలించారు. బలిగుడ ఎస్డీపీఓ కమలకాంత్ పండా, తుమిడిబొంధొ ఠాణా ఐఐసీ అశుతోష్ జెనాలు శనివారం ఆరోగ్య కేంద్రానికి చేరుకుని బాధితుడు మోహన్ నుంచి వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. గ్రామంలోని ఇంటి వరండాపై పడుకుని ఉన్న తండ్రి, కొడుకుపై గుర్తు తెలియని ఒకరు ఆమ్ల దాడి చేసి పరారయ్యారని బాధితులు పేర్కొన్నారు.

వలకు చిక్కిన మొసలి

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ జిల్లా పిపిలి సమితిలో అయిదు రోజులుగా భయాందోళనకు గురి చేసిన మొసలి శనివారం సాయంత్రం వలకు చిక్కింది. దయ నదికి కొట్టుకొచ్చిన దీనిని చూసిన గ్రామాల ప్రజలు స్నానాలకు వెళ్లడం మానేశారు. దీనిపై వారు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు చిపులింగి కాలువ వంతెన వద్ద మత్స్యకారుల వలకువిది చిక్కింది. వారు అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

చిట్టి తల్లికి చదువు ధ్యాస

జయపురం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు అనేక కష్టాలు పడి తమ పిల్లలను చదివిస్తారు. వారు ఉన్నత స్థితిలో ఉంటే చూసి సంబరిపడిపోతారు. ఇలా ఆరాట పడే ఎందరిల్లో ఈమె ఒకరు. తాను చదవుకోకపోయినా కూరగాయలు అమ్ముతూ కుమార్తెను చదివిస్తోంది. ఓ వైపు తల్లి ఎండలో కూరగాయలు విక్రయిస్తుంటే పక్కనే కూర్చొని చిన్నారి చదువుకుంటోంది. ఈ దృశ్యాన్ని చూసిన పలువురు బాలికను అభినందించారు.



తల్లి పక్కన కూర్చొని ఎండలో చదువుకుంటున్న చిన్నారి

జాగ్రత్తలు తీసుకోవాలి



రంగవల్లి కుంభ గ్రామంలో పనులు పరిశీలించిన జడ్పీ ఛైర్మన్ సస్మితమేలేక

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా లోకోత్సవం పరబ్ ఉత్సవాలకు ఆతిథ్యం ఇవ్వనున్న రంగవల్లి కుంభ గ్రామంలో జడ్పీ ఛైర్మన్ సస్మిత మేలేక శనివారం పర్యటించారు. పనులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గతంలో చోటుచేసుకున్న అవకతవకలు జరగకుండా చూడాలని, పార్కింగ్, ట్రాఫిక్ కంట్రోల్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని, పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణాలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీరు ఏర్పాట్లు, వాహనాల రక్షణపై ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాశీనగర్, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గజపతి జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గారబంద ఠాణా లావణ్యగుడ గ్రామానికి చెందిన పరపతి బైరాగి (64) శ్రీకాకుళం జిల్లా గొప్పిలి నుంచి ముఖ్య రహదారిపై శనివారం ఉదయం నడుచుకుంటూ వెళ్తున్నాడు. సమీపంలో చెకుపోస్టు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని ఐఐసీ ప్రశాంత్ నిసిక తెలిపారు.

గజలక్ష్మీదేవికి విశేష పూజలు

రాయగడ, న్యూస్‌టుడే: పట్టణంలో వివిధ కూడళ్లల్లో గజలక్ష్మీ పూజలు జరుగుతున్నాయి. అమ్మవారు సన్నిధిలో విశేషపూజలు, శాంతి హోమం జరిగింది.

సమస్యలు విన్న గవర్నర్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కలహండి జిల్లా జన సంగ్రాం సమితి ప్రతినిధులు శనివారం రాజ్‌భవన్‌లో గవర్నరు రఘుబర్‌దాస్‌ను కలిశారు. తమ ప్రాంతాల్లో తామెదుర్కొంటున్న ఇబ్బందులు వివరించారు. ఆదివాసీ ప్రాంతాల్లో అమలవుతున్న కార్యక్రమాల్లో లోపాలుంటున్నాయన్నారు. అధికారులకు లిఖిత పూర్వకంగా తెలియపరుస్తున్నా సమస్యలు యథాతథంగా ఉంటున్నాయన్నారు. 'పెసా' చట్టం త్వరలో అమలు చేసి గిరిజనం ప్రయోజనాలు కాపాడాలని కోరారు.



సంగ్రాం సమితి ప్రతినిధులతో గవర్నరు చర్చలు

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఆశ్రమ విద్యార్థులు



వివిధ క్రీడల్లో గెలుపొందిన ఆశ్రమ విద్యార్థులు, నిర్వాహకులు తదితరులు

జయపురం, న్యూస్‌టుడే: శిశు సురక్ష శాఖ తరపున కొరాపుట్ క్రీడా మైదానంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా ఉత్సవం-2024 శుక్రవారంతో ముగిసింది. ఈ పోటీల్లో జయపురానికి చెందిన ఉత్కళ బాలాశ్రమ క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ నెల 28వ తేదీన భువనేశ్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు వీరి జట్టు ఎంపికైనట్లు ఆశ్రమ అధ్యక్షుడు లింగ్‌రాజ్ ప్రధాన్ తెలిపారు. ఉత్సవాల్లో 100, 200 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, క్యారం, కబడ్డీ, చెస్ తదితర ఆటలు జరిగనట్లు బీడీఓ శక్తిమహాపాత్రో చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో మౌసమికి స్వర్ణపతకం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాకు చెందిన మౌసమి టికిరికి జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది. గోవాలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు జరిగిన జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో కొరాపుట్ జిల్లా మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మౌసమి పాల్గొన్నారు. నేషనల్ పవర్ లిఫ్టింగ్ బెంచ్‌ప్రెస్ ఛాంపియన్‌షిప్-2024లో స్వర్ణపతకం సాధించిన ఈమెను పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. గతంలో అనేక క్రీడా పోటీల్లో బహుమతులు గెలుచుకుంది.



స్వర్ణపతకం సాధించిన మౌసమి

ఆసియా హాకీ జ్ఞాపికకు ఘనస్వాగతం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బిహారులోని రాజగిరిలో నవంబరు 11వ తేదీ నుంచి ఆసియా మహిళా హాకీ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆ పోటీల జ్ఞాపిక (ట్రోఫీ)ను దేశమంతటా ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాష్ట్రానికి తీసుకొచ్చిన జ్ఞాపికను భువనేశ్వర్ విమానాశ్రయంలో రాష్ట్ర క్రీడా విభాగం, రాష్ట్ర హాకీ సంఘం ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. తరువాత ధవళగిరి బౌద్ధస్థూపం వద్ద కాసేపు ప్రదర్శించి అక్కడి నుంచి కళింగ మైదానానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో క్రీడా విభాగం సంచాలకుడు సిద్ధార్థ్ దాస్, అదనపు కార్యదర్శి బిజయకుమార్ స్వాయిన్, రాష్ట్ర హాకీ సంఘం అధ్యక్షుడు దిలీప్ తిర్కి, హాకీ ప్రచార ప్రసార పరిషద్ సీఈఓ దీపాంకర్ మహాపాత్ర్, రాష్ట్ర హాకీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



కళింగ మైదానంలో ట్రోఫీ వద్ద క్రీడావిభాగం అధికారులు, ఇతరులు

ఐటా, ఓటీఏ టెన్నిస్ సూపర్ సిరీస్ విజేతలు



బహుమతులతో విన్నర్, రన్నర్ క్రీడాకారులు. చిత్రంలో ఓటీఏ ప్రతినిధులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా టెన్నిస్ సంఘం (ఓటీఏ) తరపున ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరిగిన ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ (ఐటా), ఓటీఏ టెన్నిస్ సూపర్ సిరీస్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటారు. భువనేశ్వర్‌లోని కళింగ మైదానం టెన్నిస్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఇందులో 14 ఏళ్లలోపు విభాగం తుదిపోరులో రాష్ట్రానికి చెందిన ఆహాన్ మిశ్ర 6-0, 6-0 పాయింట్లతో కౌస్తవ సింగ్‌ను ఓడించి టైటిల్ గెలుచుకున్నాడు. మరో విభాగంలో 6-3, 6-1 పాయింట్లతో అబిభాద్య మిశ్రను ఓడించాడు. జోడీ తుదిపోరులో ఆహాన్ మిశ్ర, అబిభాద్యలు 6-2, 6-1 పాయింట్లతో అంశుమన్ ఆచార్య, ఎస్.కర్మాకర్‌ల జోడీపై గెలుపొందారు. ఇతర విభాగాల బాలికల తుదిపోరులో సాజ్‌ఫా ఎస్‌కే 6-3, 6-2 పాయింట్లతో సంరచన దాస్‌ను ఓడించి టైటిల్‌ను గెలుచుకుంది. ముగింపు కార్యక్రమంలో పోటీల సంచాలకుడు, ఓటీఏ సంయుక్త కార్యదర్శి సంజీవ్ పండా, అడ్మినిస్ట్రేటర్ సంబిత్‌పట్నాయక్, ఐటా సూపర్‌వైజర్ ప్రవీణ్ కుమార్ నాయక్ విజేతలకు బహుమతులందజేశారు.

జిల్లాస్థాయి బాలల క్రీడా పోటీలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: గంజాం జిల్లా శిశు రక్షణ శాఖ (డీసీపీఓ) తరపున జిల్లాస్థాయి బాలల క్రీడా పోటీలు శనివారం జరిగాయి. కళ్లికోట విశ్వవిద్యాలయం క్రీడామైదానంలో నిర్వహించిన వీటిని జిల్లా అదనపు పాలనాధికారి ప్రమోద్‌కుమార్ పృష్టి, డీసీపీఓ అధికారి సుభోద్ కుమార్ సడంగి అతిథులుగా ప్రారంభించారు. ఈ పోటీల్లో బాల్మికేశ్వర్ అనాథాశ్రమం (ధారాకోట), డివైన్ లైఫ్ సొసైటీ (చికిటి), శ్రద్ధాసంజీవని శిశు రక్షణ కేంద్రం (గోపాలపూర్), ఉత్కళ బాలాశ్రమం (బ్రహ్మపుర)లకు చెందిన మొత్తం వందమంది బాలబాలికలు వివిధ అంశాల్లో పోటీపడ్డారు. వీరికి 100, 200 మీటర్ల పరుగు, లాంగ్, హైజంప్, ఫుట్‌బాల్, చదరంగం, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. సాయంత్రం ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులందజేశారు.



ఫుట్‌బాల్ మ్యాచులో చికిటి, ధారాకోట జట్ల బాలుర ఆట

జాతీయస్థాయికి నవరంగపూర్ క్రీడాకారులు ఎంపిక

నవరంగపూర్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో జరగనున్న సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు నవరంగపూర్ జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం తరపున నథాన్ మాడంగి, ప్రేమ్ ప్రియూష్ బాగ్, మిథున్ శాంతాలు పాల్గొనున్నారు. ఆదివారం క్రీడాకారులు కటక్‌కు బయలుదేరనున్నట్టు పాలనాధికారి శుభంకర్ మహాపాత్ర్ తెలిపారు. వీరిని రాజకీయ నేతలు, అధికారులు, క్రీడా సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

దుకాణంపై నాటుబాంబులతో దాడి



బాంబు దాడి జరిగిన దుకాణం బయట పోలీసుల దర్యాప్తు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలో కేశ్‌పూర్ కూడలిలోని టైల్స్, మార్బల్ దుకాణంపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు మూడు నాటు బాంబులతో దాడి చేసి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పేలిన నాటుబాంబు శకలాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బాంబు దాడి సమయంలో దుకాణం మూసి ఉండటంతో ఎవరూ గాయపడలేదు.

రాష్ట్రపతికి లేఖలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఆర్ఐ, ఏఆర్ఐ, అమీన్ ఆన్‌లైన్ పరీక్షల్లో (ఇంటర్వ్యూలు) అవినీతి, అక్రమాలు జరిగాయని, రద్దు చేసి ఆఫ్‌లైన్ పరీక్షలు నిర్వహించాలని కోరుతూ 'స్టూడెంట్స్ ఎగైనిస్ట్ కరప్షన్' ప్రతినిధులు శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖలు రాశారు. కటక్ తపాలా కార్యాలయం నుంచి స్పీడ్ పోస్టులో 300 మంది ఉత్తరాలు పంపించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు కన్నుమూత

జయపురం, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే కొరాపుట్ జిల్లా ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న అజిత్ కుమార్ గుండాయత్(47) దసరా రోజు పని నిమిత్తం బయటకు వెళ్లారు. ఆయన్ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాళ్లకు గాయమైంది. క్షతగాత్రున్ని తక్షణం విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఆయన మృతికి తోటి ఉద్యోగులు సంతాపం తెలిపారు.



అజిత్‌కుమార్ (పాతచిత్రం)

సమస్యల వలయంలో ఆశ్రమ విద్యాలయం

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురం సమితి పొగడవిల్లి ఆశ్రమ బాలికోన్నత విద్యాలయం సమస్యల వలయంలో చిక్కుకుంది. గతంలో జిల్లాలో గుర్తింపు పొందిన విద్యాలయం నేడు ఆ పరిస్థితి కనపడడం లేదు. ప్రధానోపాధ్యాయురాలు తరంగమాయి మిశ్రా తీరుపై విద్యార్థినులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భోజనాల్లో నాణ్యత లేదని, మౌలిక వసతులు కొరవడ్డాయని ఆరోపిస్తున్నారు. గుమస్తాగా పనిచేస్తున్న ఉద్యోగి సాయంత్రం ఆశ్రమంలో ఉంటున్నారని తెలిపారు. తక్షణమే ప్రధానోపాధ్యాయురాలు ,గుమస్తాను బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. దీనిపై 'న్యూస్‌టుడే' సంక్షేమాధికారి గంగాధర బెహరాతో అడ్డగా ఇప్పటి వరకు విద్యార్థినుల ఫిర్యాదు చేయలేదన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటానని అన్నారు.



ఆశ్రమ విద్యాలయం ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

ఉచిత నేత్ర పరీక్షల శిబిరం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక ఖాజా వీధి సమీపాన దర్గా వీధిలోని 'రజా-ఎ-ముస్తఫా కమిటీ' ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర పరీక్షల శిబిరం నిర్వహించారు. మోడర్న్ ఐ కేర్ కేంద్రం (ఆసుపత్రి) వైద్య సిబ్బంది పాల్గొని సుమారు 150 మందికి పరీక్షలు చేశారు. నిర్వాహక కమిటీ అధ్యక్షుడు ఎండీ జిలానీ, కార్యదర్శి సయ్యద్ రజాక్, సాజు, మాజీ కార్పొరేటరు భీష్మాచార్య చౌధురి తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో పరీక్షలు జరుపుతున్న వైద్యులు

దీపస్తంభాలతో బహుళ ప్రయోజనాలు

తీర భద్రతలో కీలక పాత్ర: శ్రీరాములు



మాట్లాడుతున్న డి.శ్రీరాములు



వేదికపై దీపస్తంభం ఫొటో ఆవిష్కరిస్తున్న అతిథులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా 203 దీపస్తంభాలున్నాయని, తీర భద్రత, నౌకల రవాణా, మత్స్యకారుల ప్రయోజనాలకివి ప్రతీకలుగా నిలుస్తున్నాయని తూర్పు మండల లైట్‌హౌస్‌ల సహాయ సంచాలకుడు పి.శ్రీరాములు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఒడిశాలోని గోపాల్‌పూర్, పూరీ, చంద్రభాగ, పరదీప్, పాల్స్ పాయింట్, ప్రయాగీ దీపస్తంభాల రెండు రోజుల ఉత్సవాలు శనివారం చేపట్టింది. గోపాల్‌పూర్‌లో జరిగిన వేడుకకు అధ్యక్షత వహించిన శ్రీరాములు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ లైట్‌హౌస్‌లను పర్యాటక కేంద్రాలుగా ప్రకటించి ప్రజలు సందర్శించేలా కార్యక్రమాలు చేపట్టారన్నారు. 'దేఖో అప్నాదేశ్' (చూడండి మనదేశం) ప్రాజెక్టు కింద దేశంలోని 75 దీపస్తంభాలకు తొలి విడతగా పర్యాటక సొబగులు కల్పించారన్నారు. వేడుకలో గోపాల్‌పూర్ ఎన్‌ఏసీ అధ్యక్షుడు ఎం.జానకిరాం, ఐఎండీ అధికారులు కె.ఎస్.మూర్తి, బి.కె.త్రిపాఠి, కళాశాల ప్రిన్సిపల్ రాంప్రసాద్ పరిడ, ఎన్‌ఏసీ కార్యనిర్వహణ అధికారి మానస్‌రంజన్ మల్లిక్, పట్టణ భాజపా అధ్యక్షుడు పొంచుబెహరా, నౌకా రవాణా శాఖ దిల్లీ కార్యాలయం సహాయ సంచాలకుడు జులిన్స్ ఫెర్నాండెజ్ తదితర అధికారులు మాట్లాడారు. ఈ సందర్భంగా గోపాల్‌పూర్ లైట్‌హౌస్ చిత్రపటం వేదికపై అతిథులు ఆవిష్కరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..



అనంతరం స్థానిక విద్యాసంస్థల బాలబాలికల ద్వారా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. సరస్వతీ విద్యామందిర్ పిల్లల నాట్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆదివారం రాత్రి వరకు విభిన్న కార్యక్రమాలు జరుగుతాయని గోపాల్‌పూర్ లైట్‌హౌస్ అధికారి కె.ఎస్.పాఢి 'న్యూస్‌టుడే'కు చెప్పారు. రాష్ట్రంలోని ఇతర దీపస్తంభాల్లోనూ వేడుకలు జరిగాయి.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు



సంఘటనాస్థలంలో నుజ్జయిన ద్విచక్రవాహనాలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని సొవ్వా పంచాయతీ గొప్పులవలసలో ఎదురెదురుగా వెళ్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం పుకలిలో శనివారం జరిగిన సంతకు డుంబ్రిగుడ మండలం గసభ పంచాయతీ గొందివలస గ్రామానికి చెందిన వంతాల శ్రీను బైక్‌పై వెళ్తున్నాడు. ఒడిశా నుంచి ఆంధ్ర వైపునకు మరో యువకుడు బైక్‌పై వస్తున్నాడు. గొప్పులవలస సమీపంలో ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నాయి. క్షతగాత్రులకు స్థానికులు సపర్యలు చేశారు. ఒడిశాకు చెందిన యువకుడిని ఒడిశా ఆసుపత్రికి, గొందివలసకు చెందిన శ్రీనును అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి అంబులెన్సులో తరలించారు.

నలుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు

● 900 కిలోల గంజాయి కేసులో సూత్రధారులు ● వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద గత నెలలో రూ.2.25 కోట్ల విలువైన 900 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. అప్పుడు 8 మందిపై కేసు నమోదు చేశారు. ఐచర్ కంటైనర్ డ్రైవర్ వసీం, క్లీనర్ అర్మాన్‌లను అదే రోజు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలో వారిని శుక్రవారం అరెస్టు చేశారు. గ్రామీణ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. సెప్టెంబరు 20న ఆంధ్రా - ఒడిశా సరిహద్దు నుంచి మహారాష్ట్రకు ఐచర్ వాహనంలో గంజాయిని ఆదిలాబాద్ మీదుగా తరలిస్తున్నారు. ఐచర్ వాహనంలో డ్రైవర్ వసీం, క్లీనర్ అర్మాన్ ఉన్నారు. వీరికి ఎస్కార్ట్‌గా వ్యాన్‌లో ముగ్గురు శుభం సాబ్లె, అమర్‌సింగ్, సోమనాథ్ ఉన్నారు. పోలీసులను చూసి వారు పరారయ్యారు. వీరు మహారాష్ట్రలోని బుల్దాన, జల్గాన్ జిల్లాలకు చెందిన వారు. ప్రత్యేక పోలీసు బృందం వారిని అక్కడ అరెస్టు చేశారు. వీరితో పాటు వ్యాపారి గోతిరాం గురుదయాళ్‌సాబ్లెను కూడా అరెస్టు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ మొత్తంలో మొదటిసారి గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారులైన ఒడిశాకు చెందిన అశీష్, పండిత్, సోనూ అన్సారీ, అన్నుజైన్, మరికొంత మందిని పట్టుకునే వరకు ప్రత్యేక బృందం కార్యాచరణ కొనసాగిస్తుందన్నారు. ఈ కేసులో కృషి చేసిన జైనథ్, ఆదిలాబాద్ గ్రామీణ సీఐలు సాయినాథ్, ఫణిదర్‌తో పాటు గ్రామీణ ఎస్ఐ ముజాహిద్, సిబ్బంది రుక్మారెడ్డి, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది, తదితరులను జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించినట్లు పేర్కొన్నారు.


నకిలీలలు..!

● తప్పుడు బిల్లులతో ఇసుక రవాణా
● ప్రేక్షక పాత్రకు పరిమితమైన అధికార యంత్రాంగం

ఇసుక అక్రమ రవాణాకు అక్రమార్కులు కొత్త దారులు వెతుకుతున్నారు. జిల్లాలో ఇసుకను లారీలకు ఎత్తి రహదారి పైకి వచ్చే సరికి పొరుగు రాష్ట్రం రసీదులు చూపుతూ యథేచ్ఛగా సరిహద్దులు దాటించేస్తున్నారు. నకిలీ బిల్లులు సృష్టించి తనిఖీ అధికారులను పక్కదారి పట్టిస్తున్నారు. వాటి నిగ్గు తేల్చే సరైన వ్యవస్థ లేకపోవడంతో దందా యథేచ్ఛగా సాగుతోంది. నిత్యం 100కు పైగా లారీలు వెళ్తుంటే సగానికి పైగా నకిలీ రసీదులేనని సమాచారం.



ఈ నెల 9న పైడిభీమవరం తనిఖీ కేంద్రం వద్ద ఈ లారీని అధికారులు పట్టుకున్నారు. ఒడిశాలోని గుణుపురం వద్ద ఓ ర్యాంపు నుంచి ఇసుక తీసుకొస్తున్నట్లు రసీదులో ఉంది. దీనిపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే వేరే లారీ నంబరు వచ్చింది. అక్రమార్కులు ఈ పద్ధతిలో రోజూ పెద్దఎత్తున తరలిస్తున్నారు.



ఒడిశా పేరిట జారీ చేసిన రసీదు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

● ఆమదాలవలస నియోజకవర్గంలో ఇసుక అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పాలకొండ, పాతపట్నం నియోజవర్గాల్లోని కొన్ని మండలాల్లో ఇసుకను తోడేసి జాతీయ రహదారికి వచ్చే సరికి ఒడిశాలో అధికారికంగా నిర్వహిస్తున్న ర్యాంపు బిల్లులు చూపుతున్నారు. ఇలా రోజూ 50కి పైగా లారీలు విశాఖ వెళ్తున్నాయి. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో [illegible] బిల్లులని చెబుతుంటే మరికొందరు ఒడిశా ఇసుక వివరాలు ఆన్‌లైన్‌లో తెలుసుకోలేమని అంటున్నారు. ఒడిశా పేరిట బిల్లు సృష్టిస్తే అధికారులు పట్టుకోలేరని తెలుసుకున్న అక్రమార్కులు బరి తెగిస్తున్నారు. గుర్తించే పరిస్థితి లేకపోవడంతో తనిఖీ కేంద్రం వద్ద పచ్చ జెండా ఊపుతున్నారు.

జిల్లా నుంచి ఇసుక లారీలు విశాఖకు పైడిభీమవరం చెక్‌పోస్టు మీదుగా వెళ్తాయి. ఇక్కడ చోదకులు చాలా వరకు ఒడిశా బిల్లులు చూపుతున్నారు. ఇది అక్రమమా? సక్రమమా? అని తెలుసుకోవడం అధికారులకు సవాలుగా మారింది. ఒడిశా ప్రభుత్వం పేరిట ఉన్న బిల్లును పరిశీలిస్తే గుత్తేదారు పేరు, స్టాంపు, సంతకం ఉంటున్నాయి. దీనిపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కొన్నింటికి లారీ నంబరు, ఎక్కడ నుంచి ఇసుక తీసుకున్నారు..ఎక్కడికి తరలిస్తున్నారు వంటి వివరాలు వస్తున్నాయి. మరికొన్నింటిని పరిశీలిస్తే క్యూఆర్ కోడ్ స్కాన్ కాని పరిస్థితి. వీటిని కొందరు అధికారులు నకిలీ

ఇలా చేస్తే మేలు..

ఒడిశా సరిహద్దు కొత్తూరు తదితర ప్రాంతాల్లోనూ తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. అటు వైపు నుంచి వస్తున్న లారీల వివరాలను పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద సరిచూస్తే అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చు.

● ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు కలెక్టర్, ఎస్పీ పైడిభీమవరం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. గత 20 రోజుల్లో 15కు పైగా నకిలీ బిల్లులు, రసీదులు లేని పలు వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేశారు. ఈ నెల 16న ఒడిశా పేరిట నకిలీ బిల్లులు సృష్టించి మూడు లారీల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని గుర్తించి కేసు నమోదు చేశారు. 8, 9 తేదీల్లోనూ వరుసగా లారీలను పట్టుకున్నారు. అధికారికంగా పట్టుకున్నవి పదుల సంఖ్యలో ఉంటున్నా రోజూ పెద్దఎత్తున నకిలీ బిల్లులతో చెక్‌పోస్టులు దాటి వెళ్తున్నాయి.

ప్రతి వాహనం నంబరు నమోదు చేస్తున్నాం.. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఒడిశా బిల్లులతో వచ్చేవి సక్రమమా..కాదా? అని కనుగొనడానికి ఎలాంటి ప్రామాణిక విధానం లేకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయి. పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద ఒడిశా బిల్లుతో వచ్చే ప్రతి వాహనం నంబరు, ఇతర వివరాలను నమోదు చేసేలా చూస్తున్నాం. వారంలో ఒక రోజు ఒడిశా అధికారులను సంప్రదించి సేకరించిన వివరాలపై ఆరా తీసి చర్యలు తీసుకుంటాం. – స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ప్రభుత్వ పాఠశాలల్లో సైకిళ్లకు రక్షణ కరవైంది. పాఠశాల పరిధిలోని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు సైకిళ్లపై వస్తుంటారు. వాటిని భద్రపరిచేందుకు స్కూళ్ల ఆవరణలో షెడ్లు లేకపోవడంతో చెట్ల నీడన, ఆరు బయట ఉంచుతున్నారు. దీంతో ఎండా వానలకు అవి మరమ్మతులకు గురవుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.



రాజపురం ఆదర్శ పాఠశాల వద్ద షెడ్డు లేక ఆరుబయట ఉన్న సైకిళ్లు

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

నియోజకవర్గంలో..

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట మండలాల్లో 60 ఉన్నత పాఠశాలల్లో సుమారు 25,245 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో సగానికి పైగా విద్యార్థులు సైకిళ్లపైనే పాఠశాలలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఆయా బడుల్లో సైకిల్ షెడ్లు లేక వాటిని ప్రహరీ పక్కన, మైదానాల్లో, చెట్ల నీడల్లో నిలుపుతున్నారు. దీంతో సాయంత్రం ఇళ్లకు వెళ్లేటప్పుడు సైకిళ్లు మరమ్మతులకు గురవుతున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి సైకిల్ షెడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

మరమ్మతులకు గురవుతున్నాయి

మా పాఠశాలలో సైకిళ్లు ఉంచేందుకు షెడ్డు లేదు. ముందుగా వస్తే చెట్టు నీడలో, ఆలస్యం అయితే ఎండలోనే ఉంచుతున్నాం. సాయంత్రం పాఠశాల విడిచిపెట్టే సమయంలో సైకిల్ చక్రాలకు గాలి తగ్గిపోవడంతో మరమ్మతులకు గురై ఇబ్బంది పడుతున్నాం. – డి.ప్రశాంత్, ఆదర్శ విద్యార్థి, రాజపురం

ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తాం

ప్రభుత్వ పాఠశాలల్లో సైకిల్ షెడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. కొన్ని పాఠశాలల్లో దాతల సహకారంతో ప్రధానోపాధ్యాయులు షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన తరువాత శాశ్వత షెడ్లు నిర్మిస్తాం. – మజ్జి ధనుంజయ ఎంఈవో, కవిటి

పొదలతో ప్రమాదం..



కంచిలి మండల పరిధి మకరాంపురం కూడలి నుంచి బి.గొనపపుట్టుగ వరకు రహదారికి ఇరువైపులా పొదలు పెరిగిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు పొదలు అడ్డుగారావడంతో ప్రమాదాలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార్లు స్పందించి పొదలు తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయం ఆ శాఖ ఏ.ఈ విక్రమ్ వద్ద ప్రస్తావించగా త్వరలోనే పొదల తొలగింపు పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

వృథాగా మహిళా సాధికార భవనం

కవిటి మండలం బెజ్జిపుట్టుగలో మహిళా సంఘాల సమావేశాలకు నిర్మించిన సాధికార కేంద్రం భవనం ప్రస్తుతం వృథాగా దర్శనమిస్తోంది. గతంలో ఈ భవనంలో ప్రతి నెలా స్వయం శక్తి సంఘాల సమావేశాలు నిర్వహించి ఆయా సంఘాల రికార్డులను భద్రపరిచేవారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత వాటి గురించి పట్టించుకోకపోవడంతో కొన్నేళ్లుగా భవనం వృథాగా ఉంది. ఏపీఎం గోవిందరావు వివరణ ఇస్తూ..పెచ్చులూడి శిథిలావస్థకు చేరడంతో సమావేశాలను మరో సామాజిక భవనంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



కంచైనా ఏర్పాటు చేయండి



పలాస మండలం కొబ్బరిచెట్లూరులోని ప్రధాన వీధిలో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్తు నియంత్రిక తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిన్నారులు ఆడుకుంటూ ఆ వైపుగా వెళ్తుంటారని, జరగరానిదే ఏదైనా జరిగితే పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై సహాయక లైన్‌మేన్ సంతోష్ వివరణ ఇస్తూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

శిథిల భవనాన్ని తొలగించరూ!

వజ్రపుకొత్తూరు మండలం సుంకరజగన్నాథపురంలో 35 ఏళ్ల కిందట నిర్మించిన తుపాన్ రక్షిత భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఈ భవనం ఉండటంతో ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే భవనం లోపల స్లాబు పెచ్చులూడి పడటంతోపాటు పొదల మధ్య నిరుపయోగంగా మారింది. తక్షణమే ఈ భవనాన్ని తొలగించాలంటూ గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సీతారామయ్య మాట్లాడుతూ..పరిశీలించి భవనాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం



రాళ్లు తేలి..గుంతలు పడి



కాశీబుగ్గ పెట్రోల్ బంకు నుంచి తాళబద్ర రైల్వే గేటు వరకు వజ్రపుకొత్తూరు మండలంతోపాటు పురపాలక సంఘంలో గ్రామాలకు ప్రధాన రహదారి ఇది. వైకాపా ప్రభుత్వ హయంలో ఈ రోడ్డు నిర్మాణానికి పనులు చేపట్టారు. గుత్తేదారుడికి సకాలంలో నిధులు చెల్లించకపోవటంతో రహదారిని ఇలా అధ్వానంగా వదిలేశారు. ఈ మార్గంలో ప్రయాణించాలంటే భయపడాల్సి వస్తోందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు. గుత్తేదారుడికి బిల్లులు చెల్లించకపోవటంతో పనులు నిలిపివేశారు. ఇటీవలే కొంత బిల్లు జమచేశాం. త్వరలోనే పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ జేఈ విక్రమ్ తెలిపారు.

– న్యూస్‌టుడే, పలాస

న్యూస్‌టుడే, పలాస

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఆదాయం తెచ్చిపెట్టే వార్డుల్లో శివాజీనగర్ ముందంజలో ఉన్నా మౌలిక సదుపాయాల కల్పనలో వెనుకబడింది. ఈ ప్రాంతం శరవేగంగా విస్తరిస్తోన్నప్పటికీ ఇంకా మట్టి రహదారులే దర్శనమిస్తున్నాయి. మురుగు సమస్య పట్టిపీడుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ వార్డు అభివృద్ధికి అడుగులు పడలేదు. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు వేడుకుంటున్నారు.



శివాజీనగర్‌లో మట్టి రహదారి

ఇదీ శివాజీనగర్ వార్డు దుస్థితి

ఆదాయంలో ముందు.. సమస్యల పరిష్కారంలో వెనుకే

నేటికీ మట్టి రహదారులే..

పురపాలక సంఘం 20వ వార్డులో ఉన్న శివాజీనగర్‌లో సుమారుగా 24 వీధులు ఉండగా, 3500 మంది జనాభా, 1290 మంది ఓటర్లు ఉన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి ప్రధాన వీధితోపాటు మరో 4 చోట్ల మాత్రమే సీసీ రహదారులు నిర్మించారు. మిగతా ప్రాంతాల్లో ఇప్పటికీ మట్టిరోడ్లు దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షం పడితే అవి బురదమయంగా మారి రాకపోకలకు ఆటంకంగా తయారవుతున్నాయి. మదర్ థెరిసా విద్యాలయం నుంచి శివాజీనగర్‌కు వచ్చే రహదారి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండటంతో రోడ్డు వేసేందుకు వెనుకడుగు వేయాల్సి వస్తోంది.

అనుసంధానం లేని కాలువలు

శివాజీనగర్ వీధుల్లో నుంచి వచ్చే మురుగు కాలువల ద్వారా పెద్ద కాలువల్లోనికి చేరేలా అనుసంధానం లేకపోవటంతో అదంతా ఆర్టీసీ డిపోలోకి చేరుతోంది. ఇళ్ల నిర్మాణ సమయంలో కాలువల నిర్మాణం సక్రమంగా చేపట్టలేదు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదనీటితోపాటుగా మురుగునీరంతా డిపోలోనికి వెళ్తుండటంతో ఉద్యోగులకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కాలువల నిర్మాణం చేపట్టినా వాటి ఎత్తు తక్కువగా ఉండటంతో మురుగు నీరు ప్రధాన కాలువల్లోకి చేరేందుకు అవకాశం లేకుండాపోయింది.

అంగన్‌వాడీ కేంద్రం లేదు

శివాజీనగర్‌లో 3500 మంది జనాభా నివసిస్తుండగా ఈ ప్రాంతంలో చిన్నారుల కోసం అంగన్‌వాడీ కేంద్రం లేకపోవటంతో చిన్నారులు, గర్భిణులు పౌష్టికాహారానికి నోచుకోని దుస్థితి. కొంత మంది గర్భిణులు సమీపంలో ఉండే ఇతర కేంద్రాల వద్దకు వెళ్లాల్సి వస్తుండటంతో ఇక్కట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేయాలని, ప్రధానంగా ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేసేలా పాలకులు చొరవ చూపాలని పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కోఆప్షన్ సభ్యుడు బి.సంతోష్‌కుమార్ కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

శివాజీనగర్‌లో రోడ్లు, కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఇటీవలే మురుగునీరు సమస్యపై ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించాం. ఆ ప్రాంతంలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం. – ఎన్.రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం



ఆర్టీసీ డిపోలోకి చేరుతున్న మురుగునీరు

అండమాన్ వద్ద ఆవర్తనం

గోపాలపూర్, న్యూస్‌టుడే: ఉత్తర అండమాన్ సముద్ర ఉపరితలంలో 5.8 కిలోమీటర్ల ఎత్తులో శనివారం ఆవర్తనం ఏర్పడినట్లు గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం(ఐఎండీ) అధికారి ఉమాశంకర్‌దాస్ సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. సోమవారం ఉదయంలోగా ఇది అల్పపీడనంగా మారనుందన్నారు. ఆదివారం ఆవర్తనం ఏర్పడుతుందని, మంగళవారం పీడనంగా మారుతుందని తొలి అధ్యయనంలో ఐఎండీ వర్గాలు చెప్పాయి. ఈ నేపథ్యంలో 21 నుంచి సముద్ర ఉపరితలంలో గాలుల తీవ్రత పెరిగే సూచనలున్నందున చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు సోమవారం సాయంత్రంలోగా తీరానికి చేరుకోవాలని సూచించారు. 25 వరకు వేటకు వెళ్లరాదని ముందస్తు హెచ్చరికలు జారీ చేశామన్నారు.

అదితం ఉపకార వేతనాల అందజేత

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఏటా ఇచ్చే అదితం లక్ష్మణరావు అండ్ శేషమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఉపకార వేతనాలను ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్.రావు శనివారం అందజేశారు. ఇంజినీరింగ్ మొదటి ఏడాది చదువుతున్న దున్న తేజ, ఫోరెన్సిక్ మొదటి సంవత్సరం విద్యార్థిని కంది లావణ్యకు ఒక్కొక్కరికీ రూ.1.50 లక్షలు అందజేశారు. ఇటీవల జాతీయ, రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. జాతీయస్థాయి విజేతలకు రూ.75 వేలు, రాష్ట్రస్థాయి విజేతలకు రూ.50 వేలు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. చుక్కా శ్రీలక్ష్మికి ఛాన్సలర్ జీఎస్ఎన్.రాజు రూ.5 వేలు అందజేశారు. డీన్లు ఎంఎల్ఎన్.ఆచార్యులు, సన్నీడియోల్, విజయ్‌బాబు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్.వర్మ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో ప్రొఫెసర్ డీఎన్.రావు, ఛాన్సలర్ జీఎస్ఎన్.రాజు